

ఆ స్తుతివచనాలను విన్నవారిలో కొందరు..

''మీ అల్లుళ్లు పాండవుల్లా లోకైకవీరులని ఒప్పుకోవచ్చు. కానీ, వీరికి వరుణ ద్వీపాధిపతి అయిన క్రోధనునితో కనుక పోరు సంభవిస్తే ఎవరు గెలుస్తారో అని సందేహంగా ఉంది'' అని పలికారు.

వారి వ్యాఖ్యానాలను విన్న శ్రీముఖుడు..

''మామగారూ! ఆ క్రోధనుడెవరు? వాడి రాజ్యం ఎక్కడుంది?'' అని ఉత్సాహంగా అడిగాడు.

''వత్సా! ఇక్కడికి నూరు ఆమడల దూరంలో.. పశ్చిమ సముద్రమధ్యలో వరుణద్వీపం ఉంది. ఆ ద్వీపాన్ని పాలించే క్రోధనుడు గొప్ప యంత్రబలం కలవాడు. తన ద్వీపానికి చుట్టూ సముద్రమధ్యలో యంత్రపు గనులు అమర్చాడు. ఎవరైనా తెలియకుండా ఓడలపై వెళుతూ ఆ గనులను గుద్దుకుంటే మునిగిపోయేలా ఏర్పాట్లు ఉంటాయి. సముద్రంలో క్రోధనుడు ఏర్పాటుచేసిన యంత్రాలు ఎక్కడెక్కడున్నాయో ఎవరూ కనిపెట్టలేరు. ఇంతెందుకు.. వాడి అనుమతి లేకుండా ఫాలాక్షుడు కూడా ఈ సముద్రాన్ని దాటి ఆ నగరంలో అడుగుపెట్టలేడు'' అని చెప్పాడు శ్రీధరుడు.

ఆ మాటలు వింటూనే శ్రీముఖునిలో సమరోత్సాహం పెరిగింది.

''తమ్ములారా! పిరికిపందలైన వారిని ఎందరిని పడగొట్టినా ఏమున్నది గర్వకారణం?! నిర్వక్ర పరాక్రముడైన క్రోధనుడి వంటివాణ్ని నెగ్గినప్పుడు కదా మన పేర్లు లోకానికి తెలిసేది. పదండి.. దండయాత్రకు!'' అన్నాడు కరవాలంపై చేయివేసి.

''అన్నా! కొత్త పెళ్లికొడుకువి నువ్వెందుకు? మంగళ తోరణాలు వాడకముందే యుద్ధానికి ఉరకడం మంచిది కాదు. ఈ మాత్రం దానికి మేం నలుగురం చాలమా?! మమ్మల్ని పంపు చాలు'' అని అతణ్ని నిలువరించారు నలుగురు తమ్ముళ్లూ.

శ్రీముఖుడు అన్యమనస్కంగానే అందుకు ఒప్పుకొన్నాడు. అతని తరువాతివారిలో పెద్దవాడైన విక్రముడితో సహా నలుగురు అన్నదమ్ములూ మంచిముహూర్తంలో సముద్ర ప్రయాణం ప్రారంభించారు. వరుణావతీ నగరానికి పది యోజనాల దూరంగా దక్షిణతీరాన ఓడలు చేరాలని శ్రీధరుడు నిర్దేశించాడు.

నావికులు నేర్పుగా గాలిని అనుసరించి, ఓడలను సముచిత వేగంతో నడిపిస్తున్నారు. అన్నదమ్ములు నలుగురూ నాలుగు ఓడలపై కూర్చున్నారు. విక్రముడు ముందుగా నడిచే ఓడలో కూర్చున్నాడు. నావికులకు అధిపతి అయిన సమయవేది అనేవాడితో మాట్లాడుతూ.. వరుణావతీ నగరాన్ని గురించి విశేషాలు తెలుసుకోసాగాడు.

''బాబూ! నేను చిన్ననాటినుంచి ఈ ఓడమీద తిరుగుతున్నాను. అనేక ద్వీపాలకు పోయాను కానీ, ఎన్నడూ వరుణావతీ నగరానికి పోలేదు. ఆ రాజు రావణాసురుడి లాంటివాడని అందరూ చెప్పుకొంటారు. వరుణద్వీపం నూరు ఆమడల వైశాల్యం కలదట. అతను సముద్రం చుట్టూ యంత్రపు గనులు వేశాడు. ఆ యంత్రాలు ఎక్కడున్నాయో తెలియకుండా ఓడలను నడిపిస్తే.. అవి తగిలి ఓడలు పగిలిపోతాయి. క్రోధనుడు ఎప్పటికప్పుడు తన యంత్రవ్యూహాన్ని మార్చివేస్తూ ఉంటాడు. నేను చాలా సార్లు ఈ దారిలో ప్రయాణించాను. ఈసారి కూడా దేవుడి దయవల్ల క్షేమంగా చేరుకోగలమని భావిస్తాను'' అని చెప్పాడు సమయవేది.

విక్రముడు కూర్చున్న ఆ ఓడను అనుసరించే మిగిలిన ఓడలన్నీ నడుస్తున్నాయి. చాలాదూరం దక్షిణంగా పోయిన తరువాత ఓడలు పడమర దిశకు మళ్లాయి. అక్కడ క్రోధనుడు వేయించిన కొత్త గనులను సమయవేది దురదృష్టవశాత్తూ కనిపెట్టలేకపోయాడు.

చూస్తుండగానే ఓడలు ఫెటఫెటార్భటులతో విడిపోయి, సముద్రంలో కొట్టుకుపోయాయి. వాటిలో ఉన్న వారంతా హాహాకారాలు చేయసాగారు. సముద్రంలో ఓడలు మునిగిపోయినప్పుడు ప్రయాణికుల రక్షణ కోసం చిన్నదోనెలు ఉంచుతుంటారు. దైవికంగా విక్రముని చేతికి అటువంటి దోనె ఒకటి దొరికింది. తెప్పకంటే పెద్దదైన ఆ దోనెలోకి నీరెక్కినా మునిగిపోదు. అతికష్టంమీద అటువంటి దోనెపైకి చేరుకున్న విక్రముడు..

'ఆహా! కాలం ఎంతలో తారుమారైంది?! జాము కిందట ఓడమీద కూర్చుని, క్రోధనుణ్ని గెలిచే ఉపాయాలు ఆలోచిస్తున్నాను. ఇప్పుడు ఈ దోనెపైకి ఏ జలచరమో చేరితే నన్ను నేనే రక్షించుకోలేని స్థితిలో ఉన్నాను. ఇక దేవుణ్ని ధ్యానించడం తప్ప చేయగలిగిందిలేదు' అనుకుంటూ ఈశ్వర ధ్యానానికి సంకల్పించాడు.

అలా ఈశ్వర ధ్యానంలో ఉండగా.. అతని మనసులో జగన్మాత రూపం కదలాడింది. ఇది కూడా శుభసూచకమే కాబోలు అనుకుంటూ దోనెను విడిచిపెట్టకుండా కూర్చున్నాడు. రెండుదినాలపాటు అతను అలా సముద్రంపైనే తేలియాడాడు. క్రమంగా అతనికి స్మృతి తప్పింది. మూడోనాటి ఉదయానికి దోనె ఒక తీరానికి కొట్టుకుపోయింది. విక్రమునికి మెల్లిగా తెలివి వచ్చింది. ఓపిక తెచ్చుకుని ఒడ్డుకు చేరుకుని, ఇసుకలో చిన్న చెలమ తవ్వాడు. దానిలో మంచినీరు ఊరింది. ఆ నీటిని కడుపునిండా తాగి, సత్తువ తెచ్చుకున్నాడు.

అక్కడ జనసంచారం ఏమీ లేదు.

'దేవుని దయవల్ల నా సోదరులు కూడా ఏదో ఒక ఒడ్డుకు చేరుకుంటే బాగుండును కదా!' అనుకుంటూ తీరంవెంట కొంతదూరం నడుచుకుంటూ పోయాడు.

జాము పొద్దెక్కేసరికి అడుగులు తడబడసాగాయి. దొరికిన చెట్లపళ్లను తిని, ఆకలి తీర్చుకున్నాడు. కనుచూపుమేరలో గ్రామాలేవీ కనిపించలేదు.

చుట్టూ పరికించి చూడగా.. పడమరగా కొంత దూరంలో నల్లమబ్బుల చాటునుంచి మెరుపుతీగ కనిపించినట్లుగా ఆకుపచ్చని చెట్ల మధ్యలో తళుక్కుమంటూ ఒక బంగారువన్నె కాంతి తోచింది. ఆ కాంతినే ఆధారం చేసుకుని, ముందుకు అడుగువేశాడు. చాలాదూరం నడవగా అతనికి డొంకల మధ్యలో ఒక ఆలయం దర్శనమిచ్చింది. ఆ ఆలయం ఎత్తయిన ప్రహరీతోనూ, శక్తి విగ్రహాలతో కూడిన పెద్దగోపురాలతోనూ ఉన్నది. మూసి ఉన్న తలుపులు లోపల గడియ పెట్టకపోవడం వల్ల కొద్దిగా తోయగానే తటాలున తెరుచుకున్నాయి.

తన అదృష్టం ఫలించినదని మురిసిపోతూ.. విక్రముడు విశాలమైన లోపలి ఆవరణలో అడుగుపెట్టాడు. ఆలయానికి బంగారు రేకులపై నగిషీపని చేసినందువల్ల దూరంనుంచే కళ్లకు మిరుమిట్లు గొలుపుతున్నది.

అప్పటికి సూర్యాస్తమయం అవుతున్నది. ఆగ్నేయ భాగంలో ఉన్న తటాకంలో స్నానం చేసి, కడుపునిండా ఆ నీటిని తాగాడు. ఆ నీటి మహత్యం ఏమిటో కానీ, పంచభక్ష్య పరమాన్నాలు భుజించినంత తృప్తి, బలం వెంటనే కలిగాయి.

'ఇదేదో దేవభూమిలా ఉంది. మనుషుల సంచారం లేకపోయినా ఇక్కడికి ఎవరో తరచుగా వచ్చి.. ఆ పుష్పల తలకు నీరు పోస్తున్నట్లు, వేదికలు అలికి ముగ్గులు పెడుతున్నట్లు, మంటపాలు తుడుస్తున్నట్లు స్పష్టంగా తెలుస్తున్నది. ఇక్కడ చవిచూసిన పూలవాసన జన్మలో ఎరుగను. ఈ నీరు తాగడంతోనే అంతులేని బలం కలిగింది. ఇది మానససరోవరం కాదు కదా!' అనుకుంటూ ఆలయం వైపు నడిచాడు.

ముఖమంటపం స్ఫటిక శిలామయంగా ఉంది. స్ఫటికంలోనే మలిచిన ద్వారపాలికా విగ్రహాల చేతులలో తళతళలాడే ఇనుప కత్తులున్నాయి. అప్పటికే బయట చీకటి పడింది. ఆలయం మాత్రం శిల్పాల చేతిలోని మణుల వెలుగుల్లో దేదీప్యమానంగా వెలిగిపోతున్నది.

క్రమంగా అన్ని మంటపాలనూ దాటుకుని, గర్భాలయ ద్వారాన్ని తెరిచాడు విక్రముడు. దివ్యతేజస్సుతో ప్రకాశించే జగన్మాత విగ్రహం దర్శనమిచ్చింది. దేవతా స్వరూపాన్ని చక్కగా పరిశీలించి, ఆమె గాయత్రీదేవి అని నిర్ధారించుకున్నాడు. సముద్రంలో మునిగిపోయే ముందు పరమేశ్వరుణ్ని ధ్యానించగా.. తన మనసులో నిలిచిన దేవత ఈమే అనిపించింది. అనేక స్తోత్రాలతో దేవిని కీర్తించాడు. తాను తెచ్చిన పూలతో అర్చించాడు. కొద్దిసేపటికి తృప్తి చెంది, ముఖమంటపంలోకి వచ్చి కూర్చున్నాడు. సముద్రంలో మునిగిపోయింది మొదలు.. అక్కడికి చేరినంతవరకు జరిగిన గాథ అంతా ఒక కలలా తోచింది అతనికి. మరికొంతసేపటికి..

'ఇదంతా కల కాదు. నేను దోనెపై కూర్చుని ఉండగానే చనిపోయాను. చనిపోయేముందు నా మనసు జగన్మాతపై లగ్నం కావడం వల్ల నాకు సాలోక్యముక్తి కలిగింది. ఇక దేవి సన్నిధిలోనే నిశ్చింతగా గడిపేస్తాను..' అనుకోసాగాడు.

అంతా నిశ్శబ్దంగా ఉన్న ఆ సమయంలో దూరంగా ఏవో మాటలు వినిపించాయి. అదిరిపడి లేచి చూశాడు విక్రముడు. పరిశీలించి చూడగా ఆ ధ్వని ఆకాశం నుంచి వస్తున్నట్లు తోచింది. ఏవో కొన్ని నక్షత్రపుంజాల వలె వెలుగుతున్న ఆకారాలు కళ్లకు మిరుమిట్లు గొలిపాయి. సంస్కృతభాషలో సంభాషించుకుంటూ ఆలయంలోకే వస్తున్న ఆ వెలుగులు.. క్రమంగా దగ్గరయ్యే కొద్దీ వారు మొత్తం నలుగురు దేవకన్యలని విక్రముడు గుర్తించగలిగాడు. వారికంట పడకుండా చటుక్కున ఒక స్తంభం చాటుకు వెళ్లి దాక్కున్నాడు. ■

**(వచ్చేవారం.. కాబోయే వరుడు)**